ప్రజాశక్తి

సోమవారం 5 ఆగస్టు 2024

5

అనంతపురం





సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి వి. రాంభూపాల్

కరువు సహాయక చర్యలు చేపట్టాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి వి. రాంభూపాల్

ప్రజాశక్తి - అనంతపురం కలెక్టరేట్

ఈ సంవత్సరం సకాలంలో వర్షాలు రాకపోవడంతో ఖరీఫ్ సాగు గణనీయంగా తగ్గిందనిజిల్లా అంతటా కరువు పరిస్థితులు నెలకొన్నాయని ఈ పరిస్థితుల్లో 2023 సంవత్సరం ఖరీఫ్ రబీ సీజన్లో ప్రకటించిన ఇన్సూరెన్స్ వెయ్యి కోట్ల రూపాయలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ డిమాండ్ చేశారు. స్థానిక గణనాయక భవన్ లో జరిగిన సిపిఎం జిల్లా విస్తృతస్థాయి సమావేశంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి రాంభూపాల్ మాట్లాడుతూ గత సంవత్సరం ఖరీఫ్ లో 28, రబీలో 14 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించిన ప్రభుత్వం సరైన సహాయ చర్యలు చేపట్టలేదన్నారు. దీనివల్ల రైతాంగం తీవ్ర అప్పుల్లో కొరకు పోయిందని అన్నారు. ఈ సంవత్సరం జిల్లా అంతటా కరువు పరిస్థితులు నెలకొన్నాయని ఈ పరిస్థితుల్లో రైతాంగం ఆదుకునేందుకు తక్షణం సహాయ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పథకం ద్వారా అదనపు పని దినాలు కల్పించి కూలీలకు పనులు పెట్టాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే 9 నెలల ఉపాధి హామీ బిల్లులు పెండింగ్ ఉన్నాయనివీటిని విడుదల చేయించి కూలీలను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు .
గత రాష్ట్ర ప్రభుత్వం అమూల్ కంపెనీతో చేసుకున్న ఒప్పందం ఈనెల 10 నుండి నిలిపివేయాలని తెలుగుదేశం ప్రభుత్వం నిర్ణయించినట్లు వార్తలు వస్తున్నాయని దీంతో పాడి పరిశ్రమ మీద ఆధారపడిన రైతాంగం ఇబ్బందులు పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ డెయిరీని పునరుద్ధరించి పాల కొనుగోలు చేపట్టాలని కోరారు ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజలకు సిపిఎం కార్యకర్తలు అండగా నిలవాలని ఆయన కోరారు. కేరళ వాయినాడు బాధితులకు విరివిగా సహాయం అందించి ఆదుకోవాలని ప్రజలను కోరుతూ ఐదు ఆరు తేదీల్లో విరాళాలు సేకరించాలని ఈ మావేశం తీర్మానించినట్లు చెప్పారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఓ నల్ల అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం బాల రంగయ్య, వి. సావిత్రి, ఎస్. నాగేంద్ర, బి శ్రీనివాసులు, జిల్లా కమిటీ సభ్యులు రామిరెడ్డి, ఆర్వి నాయుడు, రామాంజినేయులు, కృష్ణమూర్తి, వెంకటనారాయణ, భాస్కర్, రంగారెడ్డి, జగన్, నిర్మల, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

ఈ - క్రాప్ ఏదీ..?

కరువు పరిస్థితుల్లో పంట నమోదు ప్రశ్నార్థకం

ఈ క్రాప్ లేకుండా నష్టపరిహారం అందేనా..?



కేంద్ర ప్రభుత్వం మార్గదర్శకాల ప్రకారం ప్రతి పంటనూ ఈ క్రాప్ బుకింగ్ చేయాలి. అది కూడా పంట వేసిన పొలంలోకెళ్లి నమోదు చేయాల్సి ఉంటుంది. ఇది ఉంటేనే భవిష్యత్‌లో పంటనష్టం సంభవిస్తే రైతులకు పరిహారం అందించడానికి వీలవుతుంది. అయితే ఖరీఫ్ ప్రారంభమై చాలాకాలమైనా ఇప్పటికీ ఈ క్రాప్ బుకింగుకు ఎటువంటి ప్రక్రియ మొదలవలేదు. ఇప్పటికే సగం పంటకాలం పూర్తయింది. ఒకవైపు వర్షాభావ పరిస్థితులు జిల్లాలో నెలకొని ఉన్నాయి. ఈ తరుణంలోనైనా ప్రభుత్వం ఈ క్రాప్ బుకింగ్‌పై చర్యలు తీసుకుంటుందా లేదా అన్న సందేహాలు నెలకొన్నాయి.

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

24 శాతం పంట

అనంతపురం జిల్లాలో సాధారణంగా 8.56 లక్షల ఎకరాల్లో పంటలు సాగవ్వాల్సి ఉండగా ఇప్పటి వరకు 2.07 లక్షల ఎకరాలకుపైగా పంటలు సాగయ్యాయి. జొన్న, మొక్కజొన్న, పొద్దుతిరుగుడు, వేరుశనగ పంటలు పూత దశలోనున్నాయి. జూన్‌లో పడిన వర్షాలకు ఈ పంటలు సాగయ్యాయి. అయితే జులై నెల మొత్తం వర్షాభావ ప్రభావం పంటలపై పడింది. ఇప్పటికీ వర్షాభావ పరిస్థితులే నెలకొని ఉన్నాయి. దీంతో వేసిన పంట ఏ మేరకు చేతికందుతుందో కూడా తెలియకుండా ఉంది. ఈ విషయంపై రైతుల్లో గుబులు నెలకొంది. ఈ సమయంలో ఈ క్రాప్ బుకింగు అయినా చేసి ఉంటే నష్టం వస్తే ఇన్‌పుట్ సబ్సిడీగాని, బీమాగాని వర్తించేందుకు వీలుంటుందన్న అభిప్రాయం రైతుల్లో వ్యక్తమవుతోంది.

వర్షాల్లేక నష్టమెచ్చే పరిస్థితి ఉంది

ఐదు ఎకరాల్లో వేరుశనగ పంట వేశాను.జూన్ ఆఖరులోపడిన వర్షాలకు విత్తనం వేశాను. అయితే జులై నెలలో వర్షాలు పడకపోవడం దిగుబడులపై ప్రభావం చూపనుంది. ఈ నెలలోనూ వర్షాలు పడకపోతే పూర్తిగా నష్టపోయే పరిస్థితి వస్తుంది. గతేడాది వర్షాభావంతో నష్టపోయాం. ఈసారి అదే జరిగేలా ఉంది. ఈసారి ఇప్పటి వరకు ఈ క్రాప్ బుకింగుకు ఎవరూ రాలేదు. అది ఉంటేనే పరిహారం వస్తుందన్నట్టు చెబుతున్నారు. ఈ క్రాప్ బుకింగ్ చేస్తే బాగుంటుంది.

సుబ్బిరెడ్డి,
లింగనపల్లి గ్రామం
రాప్తాడు మండలం

ఈ క్రాప్ బుకింగ్ చేయాలి



ఈసారి వర్షాభావంతో పంట సాగైందే చాలా తక్కువ. వేసిన పంట కూడా చేతికొచ్చే పరిస్థితి లేకుండా ఉంది. నష్టపోతున్న రైతులను గుర్తించడంలో కీలకం ఈ క్రాప్ బుకింగ్. ఈసారి ఇప్పటి వరకు ఈ క్రాప్ బుకింగ్ మొదలే కాలేదు. ప్రభుత్వం తక్షణం స్పందించి ఈ క్రాప్ బుకింగ్ చేయాలి. అదే విధంగా నష్టపోతున్న రైతులను గుర్తించి నివేదికలు రూపొందించాలి.

చంద్రశేఖర్‌రెడ్డి,
జిల్లా ప్రధాన కార్యదర్శి,
ఎపి రైతు సంఘం

బ్రహ్మోత్సవాలకు ఎమ్మెల్యేకు ఆహ్వానం

ప్రజాశక్తి-ఆత్మకూరు



ఎమ్మెల్యేకు ఆహ్వాన పత్రికను అందజేస్తున్న ఆలయ కమిటీ నిర్వాహకులు, అర్చకులు

మండల పరిధిలోని పంపనూరులో వెలసిన సుబ్రమణ్యేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలకు హాజరుకావాలని ఎమ్మెల్యే పరిటాల సునీతను ఆలయ అర్చకులు, నిర్వాహకులు కోరారు. ఈమేరకు ఆదివారం అనంతపురంలోని ఎమ్మెల్యే క్యాంపుకార్యాలయంలో ఇందుకు సంబంధించిన ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 8వ తేదీ నుంచి ప్రారంభం కానున్న శ్రావణమాస ఉత్సవాలకు రావాలని ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వహణ అధికార అక్కిరెడ్డి, ప్రధాన అర్చకులు సీతారామశర్మ, అర్చకులు, సిబ్బంది పూజారి ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

'ఫెవికాల్' ఎంఇఒ

12 ఏళ్లుగా ఒకేచోట విధులు

వెల్లువెత్తుతున్న అవినీతి ఆరోపణలు

గత ఎన్నికల్లో రాజకీయ అరంగేట్రానికి ప్రయత్నాలు



రాయదుర్గం ఎంఇఒ కార్యాలయం

ప్రజాశక్తి - రాయదుర్గం రూరల్

ప్రభుత్వ అధికారులు ఒకే ప్రాంతంలో మూడు లేదా ఐదేళ్లు కొనసాగుతారు. అయితే రాయదుర్గం ఎంఇఒగా విధులు నిర్వర్తిస్తున్న నాగమణి ఏకంగా 12 ఏళ్లు దాటిన బదిలీ కాకపోవడంపై టీచర్లే ఆశ్చర్యానికి గురవుతున్నారు. 2012 జూన్ 30వ తేదీన బాధ్యతలు స్వీకరించిన ఆమె 12 ఏళ్లకు పైగా ఇక్కడ పనిచేస్తూ రికార్డు సృష్టించిందని విద్యాశాఖకు చెందినవారే చమత్కరిస్తుంటారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లోని కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో బాధ్యతలు స్వీకరించిన ఆమె విభజిత ఆంధ్రప్రదేశ్‌లో టిడిపి, వైసిపి, తాజాగా మళ్లీ టిడిపి ప్రభుత్వం ఏర్పడ్డాక కూడా కొనసాగుతుండడం విశేషం. ఇది చాలాదన్నట్లు ప్రస్తుతం గుమ్మగట్ట ఇన్‌ఛార్జిగా కూడా కొనసాగుతున్నారు. శ్రీ సత్యసాయి జిల్లా మడకశిర (ఎస్సీ రిజర్వు స్థానం) నుండి టిడిపి టికెట్ కోసం ఆఖరి నిమిషం వరకు ప్రయత్నించి విఫలమయ్యారని ఆ పార్టీ శ్రేణులు చెబుతున్నారు. ఈ స్థాయిలో పరపతి కలిగి ఉన్న ఎంఇఒ పలు అవినీతికి పాల్పడుతున్నప్పటికీ టీచర్లు వారిలో వారు గుసగుసలాడటం తప్ప బయటికి చెప్పలేకపోతున్నారు.

అన్నింటా చేతివాటం : సెలవులు, శాలరీ సర్టిఫికెట్లు(రుణాల మంజూరు కోసం), డిప్యూటేషన్లు కాదేది అన్వర్హం అన్నట్టు కాగితం ఇచ్చేందుకు, సంతకం చేసేందుకు చేతి తడపాల్సిందేనన్న ఆరోపణలు ఉన్నాయి. 'మాకు ఖర్చులుంటాయి. పై వాళ్ల కు (ఉన్నతాధికారులను, రాజకీయ నాయకులను) ఇచ్చుకోవాల్సి ఉంద'ంటూ మరీ ముక్కు పిండి వసూలు చేస్తున్నట్లు పలువురు విమర్శిస్తున్నారు. చైల్డ్ కేర్, మెడికల్ లీవ్, ఆఫ్ పే లీవ్‌లు ఎస్ఆర్‌లో ఎంటర్ చేయకుండా సర్దుబాటు చేసేందుకు చేయి తడపాల్సిందేనని టీచర్లు గుసగుసలాడుతున్నారు. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం నాడు నేడు పథకంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల ఆధునీకీకరణకు ప్రాధాన్యత నిచ్చింది. కొంతమంది టీచర్లు బృందాలుగా ప్రయివేటు వాహనాలు ఏర్పాటు చేసుకొని అనంతపురం నుండి రాయదుర్గం మండలంలోని గ్రామాలకు విధులకు హాజరవుతున్నారు. ప్రధానోపాధ్యాయులు నాడు నేడు పనులను పర్యవేక్షణ చేయాల్సి ఉంటుంది కాబట్టి ఇలాంటి చోట్ల ఎంఇఒ కాంట్రాక్టర్ అవతారం ఎత్తి నాసిరకం పనులు చేసిందని ఆరోపణలు ఉన్నాయి. రాయదుర్గం పట్టణంలోని కనేకల్ రోడ్ లో ఉన్న ఐరన్ అంగడిలో మాత్రమే మెటీరియల్ కొనాలని షరతు పెట్టి అదనంగా కమీషన్ల రూపంలో లబ్ధి పొందిందన్న విమర్శలు ఉన్నాయి. అందరి చేత ఇక్కడే మెటీరియల్ కొనిపించడం పై అప్పట్లో పనులు చేసిన వారు పెదవి విరిచారు. తాను చెప్పిన విధంగా బిల్లులు ఇచ్చే వారితోనే కంకర కొనుగోలు చేసేందుకు లోపాయికారి ఒప్పందం చేసుకున్నట్లు అప్పట్లో ఆరోపణలు వెలువడ్డాయి. ఎక్కువ కంకర అవసరమని చెప్పి కంకర క్వారీల్లో తక్కువ ధరకే కొనుగోలు చేసి అధిక ధరలకు బిల్లులు తీసుకుందన్న విమర్శలూ ఉన్నాయి. గుమ్మగట్ట మండలంలోని రంగసముద్రం, ఎస్. హెూసళి(కొత్తపల్లి), తాళ్లకెర గ్రామాల్లో నాసిరకం పనులు జరిగినట్లు ఆరోపణలు రాగా సర్దుబాటు చేసినట్లు విశ్వసనీయ సమాచారం. గత ప్రభుత్వ హయాంలో నిర్ణయించిన ధరల మేరకు ఇసుకను కొనుగోలు చేయాల్సి వచ్చేది. దీన్ని కూడా లోపాయికారీగా తక్కువ ధరకు ఒప్పందం చేసుకొని ప్రభుత్వ ధరల ప్రకారం చెక్కులను ఇచ్చి సర్దుబాటు మొత్తాన్ని నగదు రూపంలో వెనక్కి తీసుకుందని పేర్లు చెప్పడానికి ఇష్టపడని వారు ఆరోపిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా గ్రామీణ ప్రాంతాల్లో పనిచేసే వారిని మున్సిపాలిటీ పరిధిలో బదిలీ చేసిందన్న విమర్శలు ఉన్నాయి. గుమ్మగట్ట మండలంలోని శిరిగేదొడ్డి లో పనిచేస్తున్న ఓ టీచర్‌ను రాయదుర్గం మున్సిపాలిటీ పరిధిలో ఉన్న బాలగంగాధర్ తిలక్ స్కూల్‌కు, కృష్ణాపురం నుండి అభ్యుదయ పాఠశాలకు బదిలీ చేసిందని చెబుతున్నారు. గుమ్మగట్ట మండలంలోని పైదొడ్డిలో పనిచేస్తున్న టీచర్‌ను ఎస్. హెూసళి బదిలీ చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు చెబుతున్నారు.

ఆధార్ కేంద్రం నుండి ఆదాయం : గత ప్రభుత్వ హయాంలో మండల పరిషత్ కార్యాలయంలోని ఎంఆర్‌సి భవనం ఎదురుగా ఆధార్ కేంద్రం ఉండేది. గెజిటెడ్ ఆఫీసర్ సంతకం కోసం నిర్వాహకుడితో ఉన్న ఒప్పందం మేరకు ప్రతి అప్లికేషన్‌ను ఆమె దగ్గరికి తీసుకెళ్లి సంతకాలు చేయించేవారు. ఆధార్ లో మార్పులు చేర్పుల కోసం గ్రామీణ ప్రాంతాల నుండి వచ్చిన వారిని నిబంధనల పేరిట విసిగించేవారు. దీంతో చేసేది లేక నిర్వాహకుడు చెప్పినంత డబ్బు ఇచ్చే వారని, సంతకానికి రూ.100 నుండి రూ.150 దాకా మేడంకి ఇవ్వాల్సి ఉంటుందని నిర్వాహకుడు దరఖాస్తుదారులతో చెప్పేవారని సమాచారం. ఆధార్ సెంటర్ నిర్వాహకుడే ఓ బ్యాంకు వినియోగదారుల కేంద్రాన్ని కూడా నిర్వహించేవాడు. ఖాతాదారుల నగదుకు సంబంధించి అవకతవకలకు పాల్పడి నిర్వాహకుడు ఉడాయించాడు. దీంతో ఆ కేంద్రం మూత పడింది. దీంతో రోజు వచ్చే రూ. 2వేల నుంచి 3వేల రూపాయల ఆదాయం కోల్పోయామని ఆ అధికారిణి తమ అనుచరుల వద్ద బాధపడేదని చెప్పుకుంటున్నారు.

వివరణ : రాయదుర్గం ఎంఇఒ నాగమణిపై వస్తున్న అవినీతి ఆరోపణలపై డీఈఓ వరలక్ష్మిని ప్రజాశక్తి వివరణ కోరింది. ప్రభుత్వం నుండి బదిలీలకు సంబంధించి ఎటువంటి ఉత్తర్వులు రాలేదనివచ్చాక పరిశీలిస్తామని అన్నారు. అవినీతి ఆరోపణలకు సంబంధించి తన దృష్టికి రాలేదన్నారు.

ప్రయివేటు పాఠశాలల నుంచి వసూలు



రాయదుర్గం పట్టణంలోని ప్రయివేటు పాఠశాలల నుండి ఎంఇఒలు నాగమణి, వెంకటరమేష్ పెద్ద మొత్తంలో డబ్బులు తీసుకొని ఇష్టారాజ్యం వ్యవహరిస్తున్నారు. పట్టణంలోని భావన స్కూల్ కు చెందిన విద్యార్థులకు కనేకల్ రోడ్ లో ఉన్న రాయల్ డిగ్రీ కళాశాలలో తరగతులు ఎలా నిర్వహిస్తున్నారో చెప్పాలి. జూన్ 24వ తేదీన ఎవిఆర్ స్కూల్లో నిబంధనలకు విరుద్ధంగా పాఠ్యపుస్తకాలు అధిక ధరలకు విక్రయిస్తుండగా అడ్డుకున్నాం. వారిపై నామమాత్రపు చర్యలు తసుకున్నారు. తూతు మంత్రంగా పాఠశాలలను సందర్శిస్తున్నారు. పాఠ్య పుస్తకాలు విక్రయించిన విషయాన్ని తెలియజేసి సీజ్ చేసిన కొద్ది రోజులకే నిర్వాహకులు అదే గదుల నుండి పుస్తకాల విక్రయం చేస్తున్నారంటే వారికి ఎంఇఒ ఏ స్థాయిలో సహకరిస్తున్నారో అర్థం చేసుకోవచ్చు. విద్యార్థులు, తల్లిదండ్రుల జీవితాలతో చెలగాటమాడుతున్న ఎంఇఒను విధుల నుండి తొలగించాలి. రెండో తరగతి చదివే విద్యార్థులకు పాఠ్య పుస్తకాల కోసం 5,600 రూపాయలు చెల్లించాలని ఎవిఆర్ పాఠశాల తరపున కాగితం ఇచ్చిన విషయాన్ని చెప్పినప్పటికీ చర్యలు తీసుకోలేదు.ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి ఎంఇఒ నాగమణి పనివిధానంపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలి.

శివ,
ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు

నగరవాసులకు తాగునీటి కష్టాలు

పిఎబిఆర్‌నుంచి నీటి సరఫరాలో అంతరాయం

మరమ్మతుకు గురైన మరో మోటరు

ప్రజాశక్తి - అనంతపురం కార్పొరేషన్

అనంతపురం నగరానికి పిఎబిఆర్ నుంచి తాగునీటిని సరఫరా చేస్తున్న మోటర్లు వరుసగా మరమ్మతుకు గురవుతున్నాయి. చెడిపోయిన ఒక మోటర్ రిపేరు చేస్తూ ఉంటే అంతలోనే మరో మోటారు కూడా మరమ్మతుకు గురి కావటంతో అధికారులు తలలు పట్టుకుంటున్నారు. గడచిన నాలుగు రోజులుగా డ్యామ్ లోని పంపు హౌస్‌లో ఏదో ఒక రిపేరీ వస్తుండటంతో నగరంలోని వివిధ ప్రాంతాలకు తాగునీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతోంది. మూడు రోజుల క్రితం నాన్ రిటర్నింగ్ వాల్స్ చెడిపోవడంతో దానిని రిపేర్ చేయడానికి ఒకరోజు నగరానికి నీటి సరఫరాను నిలిపివేశారు. తరచూ ప్రధాన పైపులైనుకు లీకేజీలు ఏర్పడటంతో వాటిని రిపేరి చేయాల్సి వస్తుంది. పైప్ లైన్లు మరమ్మతులు చేసే సమయంలో పైపులలో తాగునీటిని లేకుండా చేసిన తర్వాతనే ఖాళీ పైపులకు మరమ్మతు చేసే వీలుంది. దీనితో మరమ్మతులు చేపట్టడానికి కాంట్రాక్టర్లు ముందుకు రాని పరిస్థితి నెలకొంది. గతంలో 15 రోజులపాటు మోటార్ల మరమ్మతులకు గురికావడంతో వాటి రిపేరీకి లక్షల రూపాయలు వెచ్చించాల్సి వచ్చింది. మోటార్ల మరమ్మతు చేసి రెండు నెలలు కాక మునుపే మరోసారి రిపేరీ రావటాన్ని బట్టి చూస్తే మోటార్ల నిర్వహణ ఎంత అధ్వానంగా మారిందో తెలుస్తోంది. తాజాగా 15 ఫైనాన్స్ నిధులతో కొత్త మోటార్ల కొనుగోలుకు అధికారులు రంగం సిద్ధం చేశారు. ఇందుకు సంబంధించిన టెండర్ల ప్రక్రియ కూడా పూర్తయింది.500 హెచ్‌పి మోటార్లు ఏర్పాటు చేయనున్నట్లు ఇటీవల మేయర్ మహమ్మద్ వసీం సలీం విలేకరుల సమావేశంలో వెల్లడించారు. అధికారులు, పాలకుల పనితీరు వల్ల వర్షాకాలంలో సైతం నగరవాసులకు తాగునీటి కష్టాలు వస్తున్నాయని స్థానికులు అంటున్నారు.

మోటార్లను పరిశీలించిన మేయర్ : నగరానికి పిఎబిఆర్ నుంచి తాగునీటిని సరఫరా చేసే మోటర్లు మరమ్మతులకు గురైన విషయం తెలిసిన వెంటనే నగర మేయర్ మహ్మద్ వసీం ఆదివారం సాయంత్రం పిఎబిఆర్‌ను సందర్శించారు. డిప్యూటీ మేయర్లు విజయభాస్కర్ రెడ్డి, వాసంతితో మోటార్ల మరమ్మతు పనులను పరిశీలించారు యుద్ధ ప్రాతిపదికన మోటార్లను రిపేరీ చేసి నగరానికి తాగునీటి సమస్యలు రాకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా మేయర్ వసీం మాట్లాడుతూ శనివారం ఒక మోటారు పనిచేయలేదని ఆ మోటారును మరమ్మతులు చేస్తుండగా ఇంకొక మోటారు రిపేరీకి వచ్చిందని అన్నారు. శనివారం రాత్రి నుంచి నగరపాలక ఇంజినీరింగ్, వాటర్ వర్క్స్ అధికారులు, ఉద్యోగులు పనిచేస్తున్నారన్నారు. సోమవారం కొన్ని ప్రాంతాలకు తాగునీరు అందే అవకాశం ఉందన్నారు. తాగునీటి అసౌకర్యానికి ప్రజలు సహకరించాలని, నీటిని పొదుపుగా వాడుకోవాలని కోరారు. డ్యామ్ లోకి తుంగభద్ర నుంచి కొత్తనీరు చేరుతోందని కొంత రంగు మారే అవకాశం ఉందని వేడి చేసి చల్లార్చిన అనంతరం నీటిని తాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఈ ఈ సూర్యనారాయణ, డీఈ చంద్రశేఖర్, ఏఈ బాబావలి, తాగునీటి విభాగం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రైతులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా

విద్యుత్ శాఖ జిల్లా నోడల్ అధికారి మోసెస్





విద్యుత్‌శాఖ జిల్లా నోడల్ అధికారి మోసెస్

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

ప్రస్తుత ఆధునిక సమాజంలో విద్యుత్ లేనిదే ఏ పని చేయలేని పరిస్థితి నెలకొంది. విద్యుత్‌ను పొదుపు గా వాడకుండా గ్రామాల్లో పగలు పూట కూడా విద్యుత్ స్తంభాలకు వీధిలైట్లు వెలుగుతుండటం మనం చూస్తూనే ఉంటాం. తరచు హై వోల్టేజీ లేదా లో వోల్టేజీతో విద్యుత్ సరఫరా అవుతూ ఉంటుంది. అప్పుడు పలు వినియోగదారుల ఇళ్లలో ఫ్రిడ్జ్ లు, టీవీలు, ఫ్యాన్లు చెడిపోవడం జరుగుతూ ఉంటుంది. దీంతో వినియోగదారులు నష్టపోతుంటారు. అవసరమైన మేరకు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయకపోవడం వల్ల కూడా ఇలాంటి సంఘటనలు జరుగుతూ ఉంటాయి. అలాగే విద్యుత్ కొత్త కనెక్షన్ల కోసం రైతులు ఎదురుచూసే పరిస్థితి నెలకొంది. కొన్నిచోట్ల వినియోగదారులు ముఖ్యంగా రైతులు విద్యుత్ ప్రమాదానికి గురవుతుంటారు. ఈ నేపథ్యంలో విద్యుత్ సరఫరాతో పాటు జిల్లాలో నెలకొన్న విద్యుత్ సమస్యలపై జిల్లా విద్యుత్ నోడల్ అధికారి మోసెస్ ప్రజాశక్తికి ఇచ్చిన ముఖాముఖి ఇంటర్వ్యూలో పలు అంశాలు తెలియజేశారు.

ప్రశ్న : జిల్లాలో ఎన్ని విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి? కొత్త కలెక్షన్లు ఎప్పటిలోగా మంజూరు చేస్తారు?

జవాబు : జిల్లావ్యాప్తంగా హిందూపురం, ధర్మవరం, కదిరి సబ్ డివిజన్లో 1. 43 లక్షల కనెక్షన్లు ఉన్నాయి. కొత్త కలెక్షన్లకు డిపాజిట్ చెల్లించిన వారికి వరుస క్రమంలో కనెక్షన్లు ఇవ్వనున్నాము. దరఖాస్తు చేసుకున్న తరువాత ఒకటి రెండు నెలల్లో కనెక్షన్లు మంజూరు చేయడం జరుగుతుంది. అవసరమైన స్తంభాలు, వైర్లు, ఇతర పరికరాలు సమకూర్చుకోవడానికి కొంత సమయం పడుతుంది.

ప్ర : జిల్లాలో ఎన్ని సబ్ స్టేషన్లు ఉన్నాయి? కొత్తగా ఎన్ని ప్రతిపాదించారు?

జ : జిల్లా వ్యాప్తంగా 135 సబ్ స్టేషన్లు ఉన్నాయి. మరో 100 వరకు సబ్ స్టేషన్లు నిర్మాణాలకు ప్రభుత్వానికి నివేదికను అందించాం. ఈ నూతన సబ్ స్టేషన్లు ఏర్పడితే అందుకు అవసరమైన ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పడతాయి. దీంతో లో వోల్టేజీ, హై వోల్టేజీ సమస్యలు ఉండవు. ట్రాన్స్‌ఫార్మర్లు చెడిపోతే 24 గంటల్లో కొత్తవి ఏర్పాటు చేస్తున్నాము. ప్రభుత్వం కొత్త సబ్ స్టేషన్ల నిర్మాణానికి తగిన నిధులు కేటాయించిన వెంటనే నిర్మాణానికి చర్యలు తీసుకుంటాం.

ప్ర : వ్యవసాయ రంగానికి ఎన్ని గంటలు విద్యుత్ సరఫరా చేస్తున్నారు ?

జ : ఇప్పటివరకు రైతులకు వ్యవసాయ రంగానికి 7 గంటలు విద్యుత్ సరఫరా చేస్తున్నాం. నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేసి పంటలు ఎండిపోకుండా చర్యలు తీసుకుంటున్నాం. నూతన ప్రభుత్వం రైతులకు 9 గంటలు విద్యుత్ సరఫరా చేయాలన్న ఆలోచనలో ఉంది. విద్యుత్ ఉత్పత్తిని బట్టి సరఫరా జరుగుతుంది. ఆ మేరకు విద్యుత్ సరఫరాకు ప్రభుత్వం ఆమోదిస్తే 9 గంటలు విద్యుత్ ఇవ్వడం జరుగుతుంది.

ప్ర : సిబ్బంది కొరత ఉందా? మొండి బకాయిల పరిస్థితి ఏమిటి.?

జ : సిబ్బంది కొరత ఉంది. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా 20 మంది ఏఈలు మాత్రమే ఉన్నారు. మరో వంద మంది ఏఈలు అవసరం ఉంది. అందుకు ప్రభుత్వానికి నివేదికను పంపాం. కొత్త ఏఈలు వస్తే పని భారం తగ్గుతుంది. వినియోగదారులకు కూడా మెరుగైన సేవలు అందించడానికి అవకాశం ఉంది. అంతేగాక సచివాలయానికి ఒక డిఎన్ఎం నియమిస్తే మంచిదని వ్యక్తిగతంగా అభిప్రాయపడుతున్నా. అలాగే జిల్లా వ్యాప్తంగా సుమారు రూ. 70 కోట్ల వరకు మొండి బకాయిలు ఉన్నాయి. వాటిని త్వరగతిన చెల్లించి విద్యుత్ శాఖకు సహకరించాలని కోరుతున్నాము. నోటీసులు ఇచ్చాం. చెల్లించని పక్షంలో చట్టపరంగా తగు చర్యలు తీసుకుంటాం.

ప్ర : రైతులకు, వినియోగదారులకు మీరు ఇచ్చే సలహాలు సూచనలు ఏమిటి ?

జ : విద్యుత్ కనెక్షన్ ఉన్న ప్రతి వినియోగదారుడు ప్రతినెల సక్రమంగా విద్యుత్ బిల్లు చెల్లించాలి. వర్షాకాలంలో విద్యుత్ స్తంభాలకు ఉన్న వైర్లు ఎటువంటి పరిస్థితుల్లోనూ తాకరాదు. ముఖ్యంగా రైతులు తమ విద్యుత్ మోటార్ల ద్వారా సొంతంగా మరమ్మతులకు దిగి ఒక్కొక్కసారి ప్రాణాలు తీసుకుంటున్నారు. సొంతంగా రిపేర్లు చేయడం, స్తంభాలు ఎక్కడం తదితర పనులు చేపట్టరాదు. విద్యుత్ లైన్‌మెన్, హెల్పర్ సహాయం తీసుకోవాలి. వినియోగదారులు కానీ రైతులు కానీ విద్యుత్ ముందు సాహసాలు చేయవద్దని కోరుతున్నాం. హై వోల్టేజీ, లోవోల్టేజీ సరఫరా సమయంలో జాగ్రత్తలు పాటించాలి. సాధ్యమైనంత వరకు విద్యుత్ ను ఆదా చేసుకోవాలి.

'హెల్ప్ వాయనాడ్'

వాట్సాప్ గ్రూప్ ద్వారా యువకుల విరాళాలు సేకరణ రూ.50 వేల విలువైన వస్తువులు అందజేత



సేకరించిన వస్తువులను కేరళ రాష్ట్రం వాయనాడ్‌కు తరలిస్తున్న యువకులు శంషుద్దీన్, రోషన్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఆ ఇద్దరు యువకులు స్నేహితులతో కలిసి ప్రతి ఏడాది సహజ సిద్ధ అందాలకు నిలయమైన వాయనాడ్‌కు వెళ్తుంటారు. అయితే ప్రస్తుతం ప్రకృతి ప్రకోపానికి వాయనాడ్‌లో 320 మందికిపైగా మృత్యువాత పడిన విషయం తెలిసిందే. ప్రతిసారి విడిది చేసే ఆ ప్రాంత హృదయ విదారకర పరిస్థితి చూసి ఆ యువకులు చలించిపోయారు.. అయ్యో పాపం అంటూ నిట్టూర్పు వదిలి వెళ్లిపోలేదు.. మానవతా దృక్పథంతో నగరంలోని షమ్ము సెల్ పాయింట్‌కు చెందిన శంషుద్దీన్, రోషన్ కలిసి తమవంతు సహాయం చేయడానికి ముందుకొచ్చారు. 'హెల్ప్ వయనాడు కేరళ' అనే గ్రూపును ఏర్పాటు చేసి ముందుగా ఇద్దరూ చెరో రూ.వేలు వేశారు. తర్వాత తమ స్నేహితులను తోచినంత సాయం చేయమని అర్థించారు. మిత్రులు కూడా తమకు తోచినంత వారి అకౌంటుకు పంపించారు. మొత్తం రూ.50వేలు కాగానే హోల్‌సేల్ దుకాణాల వద్దకు వెళ్లి నిత్యావసర వస్తు సామగ్రిని కొనుగోలు చేసి బెంగళూరులోని మలయాళీ కార్యాలయంలో అందజేశారు. హెల్ప్‌గ్రూపు ఏర్పాటు చేసిన శమ్ము మొబైల్స్ వారితోపాటు దాతృత్వం ప్రదర్శించిన వారంతా రూ.25ఏళ్లలోపు వాళ్లే కావడం విశేషం. ఈ యువకుల స్ఫూర్తి అందరికీ ఆదర్శప్రాయంగా నిలుస్తుందని చెప్పడంలో ఆశ్చర్యం లేదు. సాయం చేసిన వారిలో యువకులు శంషుద్దీన్, రోషన్‌తోపాటు జమీర్, సోమశేఖర్ ఉన్నారు.

సిపిఆర్‌పై అవగాహన ఉండాలి

ప్రభుత్వ వైద్యులు మనోరంజన్‌రెడ్డి

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

వ్యక్తి అపస్మారక స్థితిలో ఉన్నప్పుడు సిపిఆర్ పద్ధతుల ద్వారా వారిని కాపాడే అవకాశం ఉందని ప్రభుత్వ వైద్యులు డాక్టర్ మనోరంజన్‌రెడ్డి సూచించారు. స్థానిక [illegible]లో ఆరోగ్య భారతి 25వ వార్షికోత్సవ సందర్భంగా ఆరోగ్య సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యక్తి ప్రాణాపాయ స్థితిలో ఉన్నప్పుడు వెంటనే అంబులెన్స్‌కు ఫోన్ చేసి వచ్చేంత వరకూ వారి ఛాతీ మీద రెండు చేతులతో ఒత్తిడి చేస్తూ నోటి ద్వారా గాలి ఊదాలన్నారు. అప్పుడు రోగి అపస్మారక స్థితిలో నుంచి బయటికి వచ్చే అవకాశం ఉందన్నారు. ఇందులో భాగంగా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య భారతి జిల్లా కార్యదర్శి రామకృష్ణ, క్షేత్ర సంఘటన కార్యదర్శి కుమారస్వామి, జిల్లా గౌరవాధ్యక్షులు వి.నాగేశ్వరరావు, గైనకాలజిస్ట్ శివజ్యోతి, బాలాజీసింగ్, రమేష్, ఝాన్సీ, మంజుల వాణి, రతన్‌బాబు, కృష్ణమూర్తి, మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు.



సిపిఆర్ విధానంపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ మనోరంజన్‌రెడ్డి

'అనంత' రైతులను ఆదుకోవాలి

పిసిసి మాజీ అధ్యక్షులు సాకే శైలజానాథ్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్



విలేకరులతో మాట్లాడుతున్న పిసిసి మాజీ అధ్యక్షులు సాకే శైలజానాథ్

వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో తీవ్రంగా నష్టపోతున్న జిల్లా రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని పిసిసి మాజీ అధ్యక్షులు సాకే శైలజానాథ్ డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితులు వల్ల ఇప్పటి వరకూ వేసిన పంటలు ఎండిపోయే పరిస్థితి నెలకొందన్నారు. జిల్లాలో ప్రధాన పంట అయిన వేరుశనగను కేవలం 10వేల ఎకరాల్లో సాగవడం బాధాకరమన్నారు. వేసిన పంట కూడా వర్షం లేక భూమిలో ఉన్న మొలకెత్తి పరిస్థితి నెలకొందన్నారు. గతేడాది కంటే ఈసారి చాలా వర్షం లేక దుర్భరకర పరిస్థితి నెలకొందన్నారు. ఇకపోతే పైభాగాల్లో విపరీతమైన వర్షాల కారణంగా హంద్రీనీవా అడ్డంకులను దాటుకుని రాయలసీమకు నీరు ఇస్తామని ప్రభుత్వం చెబుతోందన్నారు. మీనమేషాలు లెక్క పెట్టకుండా అన్ని చెరువులనూ నీటితో నింపి రైతాంగాన్ని కాపాడాలని కోరారు. ఒక రైతుగా తనకు ఆ బాధ తెలుసు అన్నారు. రెండేళ్లుగా రైతులకు పంట నష్టపరిహారం, సబ్సిడీ పరికరాలు అందలేదన్నారు. కరువులో ఉన్న జిల్లా చిన్న, సన్నకారు రైతులకు డ్రిప్, స్ప్రింక్లర్ల పరికరాలను వందశాతం ఉచితంగా ఇవ్వాలన్నారు. నీటి సమస్యపై మాట్లాడడానికి అన్ని ప్రజాసంకాలు అన్ని రాజకీయ పార్టీలతో సమావేశం ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కాపు గాజుల వాసు, రామ్‌చరణ్‌యాదవ్, ఆంజనేయులు, షర్మాస్‌వలి, ఇంద్రావతి, ఓబులేసు, మురళీ, మహిళా నాయకురాలు కవిత, తదితరులు పాల్గొన్నారు.

'ఐఎస్‌ఓ' గుర్తింపు కోసం 'ఐసిడిఎస్' ముస్తాబు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

అనంతపురంలోని ఐసిడిఎస్ జిల్లా కార్యాలయం ఐఎస్‌ఓ ప్రమాణాలకు అనుగుణంగా ముస్తాబవుతోంది. ఇందులో భాగంగా కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశాల మేరకు ఐసిడిఎస్ పీడీ బీఎన్ శ్రీదేవి ఆధ్వర్యంలో కార్యాలయాన్ని సమూలంగా మార్చేస్తున్నారు. పీడీ కార్యాలయంలో ఐసీడీఎస్ రెగ్యులర్ ఉద్యోగులతో పాటు అనుబంధ ఐసీపీఎస్, ఛైల్డ్‌లైన్, గృహ హింస నిరోధక (డీవీ సెల్) విభాగాలు ఉన్నాయి. అయితే అవన్నీ ఐ.ఎస్.ఓ ప్రమాణాలకు అనుగుణంగా మార్పులు, చేర్పుల ప్రక్రియ వేగవంతంగా సాగుతోంది.

ప్రత్యేక బృందం పరిశీలన

స్థానిక ఐసిడిఎస్ జిల్లా కార్యాలయాన్నిఆదివారం హైదరాబాద్ నుంచి ప్రత్యేక బృందం సందర్శించింది. గ్లోబల్ మేనేజ్మెంట్ సర్టిఫికేషన్ సర్వీసెస్ సంస్థకు చెందిన లీడ్ ఆడిటర్, కె.ఎస్.ఎన్. ప్రసాద్, కో-ఆడిటర్ సింగయ్య బృందం ఐసీడీఎస్ కార్యాలయంలోని అన్ని విభాగాలను పరిశీలించి ఐఎస్‌ఓ ప్రమాణాలకు అనుగుణంగా ఎలా ఉండాలో వివరించి ఐసీడీఎస్ పీడీ డాక్టర్ బీఎన్ శ్రీదేవికి సలహా, సూచనలు ఇచ్చారు. అందుకు తగ్గట్లు ఏర్పాట్లు చేయాలని, మరోసారి పరిశీలనకు వస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నోడల్ అధికారిణి వనజాక్షి, సీనియర్ అసిస్టెంట్లు ధనలక్ష్మి, బాబా నూరుద్దీన్, డీసీపీఓ మంజునాథ, కౌన్సెలర్ వెంకటకుమార్, ఛైల్డ్‌లైన్ కో ఆర్డినేటర్ కృష్ణమాచారి, డీవీసీ విభాగం సోషల్ కౌన్సెలర్ ఉమాదేవి, లీగల్ కౌన్సెలర్ నర్మద, శిశుగృహ మేనేజర్ దీప్తి, సఖి - వన్ స్టాప్ సెంటర్ మేనేజర్ శాంతామణి, డీఈఓ గీత, సఖి ఉద్యోగులు మంజుల, శ్రీకళ, కిరణ్, హోంగార్డ్ మల్లికార్జున, అటెండర్ బాషా, పీడీ డ్రైవర్ జగన్, సిబ్బంది పాల్గొన్నారు.

అనంతపురం పీడీ కార్యాలయం పరిశీలన



ఐసిడిఎస్‌సేవల వివరాలను అడిగి తెలుసుకుంటున్న ప్రత్యేక బృందం సభ్యులు



అభ్యర్థులకు పుస్తకాలు అందజేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు

ప్రజాశక్తి-అనంతపురం అర్బన్

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు సాధ్యమని జెడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అన్నారు. ఆదివారం స్థానిక వాల్మీకి భవనంలో వాల్మీకి ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వాల్మీకి విద్యార్థులకు టెట్ మోడల్ గ్రాండ్ టెస్ట్, డీఎస్సీ మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేటి పోటీ ప్రపంచంలో ఉద్యోగాలు సంపాదించడానికి పోటీ పరీక్షలకు సంసిద్ధం అవడం చాలా అవసరమన్నారు. పేద వాల్మీకి విద్యార్థులకు వాల్మీకి ఉద్యోగుల సంక్షేమ సంఘం అండగా ఉండటం హర్షణీయమన్నారు. ఈ కార్యక్రమంలో వాల్మీకి ఉద్యోగుల సంక్షేమ సంఘం అకులప్ప, వాల్మీకి కుల పెద్దలు, వాల్మీకి ఉద్యోగులు పాల్గొన్నారు.

ట్యాంకర్లతో నీటిసరఫరా

ప్రజాశక్తి-శింగనమల



ట్యాంకర్ నీటిని పట్టుకుంటున్న మహిళ, నాయకులు

మండలంలోని బండమీదపల్లి గ్రామానికి ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేశారు. ఈనెల 1వతేదీన గ్రామంలో పింఛన్ల పంపిణీకి హాజరైన ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీని స్థానిక మహిళలు కలిసి నీటి సమస్యపై విన్నవించారు. ఇందుకు ఎమ్మెల్యే స్పందిస్తూ అతి త్వరలో ట్యాంకర్లు ఏర్పాటు చేసి నీరు సరఫరా చేస్తామని హామీ ఇచ్చారు. హామీ మేరకు ఆదివారం ట్యాంకర్లను ఏర్పాటు చేసి నీరు సరఫరా చేశారు. అడిగిన వెంటనే స్పందించి ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేసి ఎమ్మెల్యే శ్రావణిశ్రీకి టిడిపి నాయకులు కాయల రమణయాదవ్, చెన్నయ్య, ప్రతాప్, కాయల జయరాముడు, వెంకటరాముడు, చంద్రారాయుడు, రామన్న, గోపాల్, టిడిపి నాయకులు, గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

అన్సర్‌బాషా మృతికి నివాళి



నివాళులర్పిస్తున్న మేయర్ వసీం

అనంతపురం కార్పొరేషన్ : నగర పాలక సంస్థ కార్యాలయంలో షరాఫ్ గది అటెండర్‌గా పని చేస్తున్న ఆన్సర్‌బాషా ఆదివారం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న మేయర్ మహమ్మద్ వసీం మృతుని నివాసానికి వెళ్లి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మేయర్ వెంట వైసీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రకాష్‌రెడ్డి తోపాటు పలువురు నాయకులు ఉన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం



అన్నదానం చేస్తున్న టిడిపి నాయకులు

పుట్లూరు : ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ పుట్టినరోజు వేడుకలను పురస్కరించుకుని మండల పరిధిలోని కోమటికుంట్లలో చవ్వా కులశేఖర్‌రెడ్డి కుటుంబీకుల సహకారంతో ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా కేక్ కోసం కార్యకర్తలకు పంచిపెట్టారు. తర్వాత రాత్రి తాడిపత్రిలోని ఝాన్సీరాణి వృద్ధాశ్రమంలో అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో రామానాయుడు, జయచంద్ర, వెంకటనాయుడు, ప్రవీణ్, మోహన్, శివశంకర్‌రెడ్డి, రామమోహన్, మధు, తాజా, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి

ప్రజాశక్తి-వజ్రకరూరు



విలేకరులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి

జిల్లాలో వ్యవసాయ పరిస్థితులు దారుణంగా నెలకొన్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే రైతులను ఆదుకోవాలని మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం ఉరవకొండలోని వైసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలకేరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ దాదాపు ముగుస్తున్నప్పటికీ జిల్లాలో వర్షాలు రాకపోవడం వల్ల జిల్లావ్యాప్తంగా వేరుశనగతోపాటు ఇతర పంటలు 35 శాతం కూడా సాగు కాలేదన్నారు. ఇతర రాష్ట్రాల్లో వర్షాలు రావడం వల్ల తుంగభద్ర, శ్రీశైలం డ్యాములకు నీరు వచ్చాయన్నారు. హంద్రీనీవాకు నీరు విడుదల చేసే సమయంలో కాంట్రాక్టర్లు పని చేయడం వల్ల నీటి విడుదలలో ఆలస్యం జరిగిందన్నారు. ప్రస్తుతం జిల్లాలో వర్షాలు కురిస్తే ఎలాంటి పంటలను రైతులు సాగు చేసుకోవాలో.. వాటికి సంబంధించిన విత్తనాలను సేకరించేందుకు ముందస్తు ప్రణాళికలు చేసుకోవడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. జిల్లాలో 35శాతం పంటలు సాగుచేసిన రైతులకు ప్రభుత్వం పంటల బీమాకు సంబంధించిన ప్రీమియం కూడా చెల్లించలేదన్నారు. మరోవైపు రైతుల పెట్టుబడుల కోసం రూ.20వేలు అందిస్తామని చెప్పిన సిఎం చంద్రబాబు ఇంతవరకూ రైతులకు న్యాయం చేయలేకపోయారని విమర్శించారు. అదే జగన్ సిఎంగా ఉన్న సమయంలో రూ.35వేల కోట్లు రైతులకు పెట్టుబడి సాయంగా అందించారన్నారు. అనేక హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాలంటే భయమేస్తోందని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. హామీలు ఇచ్చేటప్పుడు ఒక అంచనా.. ప్రణాళిక లేకుండా తప్పుడు వాగ్దానాలు చేసి చేతులెత్తి చేస్తున్నారని ఆరోపించారు. సిఎం చంద్రబాబు ప్రమాణస్వీకారం చేసేటప్పటికి రూ.7వేల కోట్ల బడ్జెట్ ఉన్నప్పటికీ ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టారన్నారు. 40ఏళ్ల అనుభవం ఉందని చెప్పుకుంటున్న చంద్రబాబు ఒక నిర్దిష్టమైన ప్రణాళికలు లేకుండా ప్రజలకు మోసపూరితమైన హామీలు ఇచ్చి ఓట్లేసిన ప్రజలను నిలువునా మోసం చేస్తున్నారని ఆరోపించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా వైసిపికి ఓట్లు వేసిన వారిపై దౌర్జన్యాలు, దాడులకు దిగుతూ చిన్నచిన్న ఉపాధి అవకాశాల్లో ఉన్న ఉద్యోగాలను తొలగిస్తూ వైశాచిక ఆనందాన్ని పొందుతున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా ఆయా పనులను ఆపి ఉరవకొండ పట్టణంతోపాటు గ్రామాలకు తాగునీటిని సరఫరా చేయాలని కోరారు. ఈ సమావేశంలో వైసిపి నాయకుల పాల్గొన్నారు.

ముగిసిన రాష్ట్రస్థాయి కరాటే పోటీలు

విజేత విజయనగరం జట్టు

ప్రజాశక్తి-తాడిపత్రి రూరల్

పట్టణ పరిధిలోని బాలాజీ ఫంక్షన్ హాల్‌లో మూడు రెండు రోజులుగా నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి కరాటే పోటీలు ఆదివారం ఘనంగా ముగిశాయి. పోటీలను రెండు విభాగాలుగా నిర్వహించగా మొదటి భాగంలో మొదటగా విజయనగరం, రెండవ స్థానంలో అనంతపురం, మూడో స్థానంలో విశాఖపట్నం నిలిచినట్లు నిర్వాహకులు సాయిబాబా తెలిపారు. రాష్ట్రస్థాయిలో ఎంపికైన క్రీడాకారులను ఆగ్రాలో జరగబోయే జాతీయ కరాటే పోటీల్లో పాల్గొంటారని వివరించారు. అదేవిధంగా జిల్లాస్థాయిలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను రాష్ట్రస్థాయి పోటీలను నిర్వహించడం ద్వారా జాతీయస్థాయికి తీసుకుపోవడం చాలా ఆనందంగా ఉందని క్రీడాకారులు తెలిపారు. పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు గోల్డ్, సిల్వర్ బహుమతులను అందించారు. ఈపోటీల్లో రాష్ట్రంలోని 13 జిల్లాల నుంచి దాదాపు 400 మంది క్రీడాకారులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న అతిథులు

మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర కన్వీనర్ ఫణిభూషణ్

మున్సిపల్, కార్పొరేషన్లలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల దీర్ఘకాలిక సమస్యలు తక్షణమే పరిష్కరించాలని మున్సిపల్ ఉపాధ్యాయుల సంఘం రాష్ట్ర కన్వీనర్ ఫణిభూషణ్ డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలో నిర్వహించిన ఎస్‌టియు నగర కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ మున్సిపల్ కార్పొరేషన్‌లో పని చేస్తున్న ఉపాధ్యాయులకు చాలాఏళ్లుగా ప్రమోషన్లు నిర్వహించకపోవడం, బదిలీలు చేయకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఆగస్టు నెల మొదలైనా ఉపాధ్యాయుల సర్దుబాటు చేయకపోవడం శోచనీయంమన్నారు. వెంటనే ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఐఆర్ ప్రకటించి పిఆర్‌సి కమిటీని ఏర్పాటు చేయాలన్నారు. వీటితోపాటు అనేక సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌టియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రమణారెడ్డి, రామాంజనేయులు, జిల్లా నాయకులు మురళీకృష్ణ, విరూపాక్షగౌడ్ వేణుగోపాల్, కృష్ణమూర్తినాయుడు, నగర నాయకులు సురేష్‌కుమార్, ప్రభాకర్, గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభా పురస్కారాలను సద్వినియోగం చేసుకోవాలి

ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు

ప్రజాశక్తి-రాయదుర్గం



ప్రతిభా పురస్కారాలను అందజేస్తున్న ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు

విద్యార్థులు ప్రతిభా పురస్కారాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు సూచించారు. ఆదివారం పట్టణంలోని చౌడేశ్వరీదేవి ఆలయం వద్ద తొగట వీర క్షత్రియ సంఘం అధ్యక్షులు సిరిమాలు కృష్ణమూర్తి అధ్యక్షతన ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు పురస్కారాలు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులు ఇటువంటి అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నతంగా ఎదగాలని కోరారు. ముఖ్యంగా ప్రభుత్వ పథకాలతోపాటు కులసంఘాలు అందిస్తున్న ఇలాంటి సహకారాన్ని అంది పుచ్చుకోవాలన్నారు. తొగటవీర క్షత్రియ విద్యా సంక్షేమ సంఘం అధ్యక్షులు మద్దిలేటి ప్రభాకర్ మాట్లాడుతూ గత 11 సంవత్సరాలుగా తొగటవీర విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఇంటర్, పదో తరగతిలో ప్రతిభ కబనరిచిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కాగా చౌడమ్మ గుడి వీధి వద్ద ఉన్న 15వవార్డు డిపిఇపి పాఠశాలకు చౌడేశ్వరీదేవి మున్సిపల్ పాఠశాలగా నామకరణం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మున్సిపల్ ఛైర్‌పర్సన్ పొరాళు శిల్ప, మాజీ మున్సిపల్ ఛైర్‌పర్సన్ జ్యోతి, మాజీ వైస్‌ఛైర్మన్ వెంకటేశులు, వార్డు సభ్యులు రేఖ, శ్రీలక్ష్మి, శారద, సంజీవ, ప్రశాంతి, మాజీ సభ్యులు పొరాళు పురుషోత్తం, లావణ్య, భారతి, పూజారి శ్రీనివాసులు ఆలయ కమిటీ ధర్మకర్త శ్రీరాములు, సంఘం సభ్యులు హనుమంతు, సత్యనారాయణ, లోకేష్, రాజు, శివప్ప, నాగరాజు, గోపీ, నాగార్జున, తదితరులు పాల్గొన్నారు.



తిరుమల శ్రీవారిని దర్శించుకుని బయటకు వచ్చిన ఎమ్మెల్యే దగ్గుపాటి, నాయకులు

తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే దగ్గుపాటి

అనంతపురం కలెక్టరేట్ : అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ఆదివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. అలిపిరి నుంచి కాలినడకన తిరుమలకు వెళ్లిన ఆయన విఐపి బ్రేక్ దర్శనం సమయంలో స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ స్వామివారిని కాలినడకన వచ్చి దర్శించుకోవడం ఆనందంగా ఉందన్నారు. రాష్ట్రం అభివృద్ధి పథంలో నడిచి అంతా మంచి జరగాలని స్వామి వారిని కోరుకున్నట్లు తెలిపారు. శ్రీవారిని దర్శించుకున్న వారిలో టిడిపి నాయకులు లక్ష్మీనారాయణ, సుధాకర్‌నాయుడు, గాజుల ఆదెన్న, జెవిఎల్ మురళీధర్, రాయల్ మురళి, కాచి హరిప్రసాద్, గుర్రం నాగభూషణం, సాకే లక్ష్మీనరసింహ, సుధాకర్‌యాదవ్, కృష్ణకుమార్, తొండపాటి రమేష్ పోతుల లక్ష్మీనరసింహ, జోగి రాజేంద్ర, చంటి, మార్కెట్ శ్రీధర్, సునీల్ రాయల్, తదితరులు ఉన్నారు.

ఘనంగా చౌడేశ్వరీదేవి జయంతి వేడుకలు



అమ్మవారు

పుట్లూరు : మండల కేంద్రంలోని చౌడేశ్వరీదేవి ఆలయంలో ఆదివారం అమ్మవారి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. తర్వాత భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.



అమ్మవారికి పూజలు చేస్తున్న అర్చకులు

రాయదుర్గం : పట్టణంలోని నేసే పేటలో వెలసిన చౌడేశ్వరీ దేవి జయంతి ఉత్సవాలను ఆదివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఉదయం అమ్మవారికి అభిషేకం చేశారు. తర్వాత వందలాదిమంది మహిళలు అమ్మవారికి వడిబియ్యం సమర్పించారు. అనంతరం మహా మంగళహారతి నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాను అందించారు. ఈ కార్యక్రమంలో పుర ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, మహిళలు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు



పురస్కారాలను అందజేస్తున్న గుమ్మనూరు నారాయణ

గుత్తి : పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం శ్రీకృష్ణదేవరాయ బలిజ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను అందజేశారు. బలిజ సామాజిక వర్గానికి చెందిన విద్యార్థులు పరీక్ష ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన వారికి ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్ సోదరుడు నారాయణ, దక్షిణ భారత కాపు, బలిజ, తెలగ, ఒంటరి సంఘం కన్వీనర్ దాసరి రాము ప్రతిభా పురస్కారాలను అందజేశారు. ముందుగా విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీకృష్ణదేవరాయ బలిజ సంక్షేమ సంఘం నాయకులు ఆముదాల గిరిధర్, జి.నాగరంగ ప్రసాద్, ఎ.బాలరాజు, శ్రీకరం వెంకటేష్, టిడిపి నాయకుడు ఎంకె.చౌదరి తదితరులు పాల్గొన్నారు.

ఒడిఎఫ్ పల్స్ సర్వే వేగవంతం చేయాలి

నార్పల : మండలంంలో వెనుకబడిన ఓడిఎఫ్ పల్స్ సర్వేను వేగవంతం చేయాలని ఇఓఆర్‌డి శైలజారాణి సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆదివారం మండల కేంద్రంలోని ఎంపిడిఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, మహిళా పోలీసులు, సర్వేయర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా సర్వేలో ఇబ్బందులు తెలుసుకుని సందేహాలను నివృత్తి చేశారు. సచివాలయ సిబ్బంది సమన్వయంతో పని చేసి సర్వే వేగవంతం చేయాలని సూచించారు.

నేరాలు ఘోరాలు

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



మృతిచెందిన లక్కిరెడ్డి

గుత్తి : మండలంలోని బాచుపల్లి గ్రామ శివారులో 44వ జాతీయ రహదారిపై ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి ఆదివారం మృతిచెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. కరిడికొండ గ్రామానికి చెందిన లక్కిరెడ్డి(38) పని నిమిత్తం గుత్తికి వచ్చి తిరిగి స్వగ్రామానికి వెళ్తూ గత నెల 28న బాచుపల్లి గ్రామ శివారులో బాట సుంకులమ్మ ఆలయం ఎదురుగా ద్విచక్రవాహనం అదుపు తప్పి బోల్తా పడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. తీవ్రంగా గాయపడ్డ అతన్ని కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం గుత్తి ఆసుపత్రికి తరలించగా వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్సలకు అనంతపురంకు తరలించారు. సర్వజనాసుపత్రిలో వైద్యులు ఉన్నత చికిత్సలు అందించినప్పటికీ పరిస్థితి విషమించి మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

చోరీ కేసులో నిందితుడు అరెస్టు



నిందితుడి వివరాలు వెల్లడిస్తున్న ఎస్ఐ హేమాద్రి

పుట్లూరు : మండలంలోని కడవకల్లు గ్రామంలో కురాకుల ఆదినారాయణ ఇంట్లో గతనెల 24న జరిగిన చోరీ కేసులో నిందితుడిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ హేమాద్రి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు... నిందితుడు కడవకల్లు గ్రామానికి చెందిన నగిరి నారాయణమూర్తి ఆదివారం కడవకల్లు క్రాస్ వద్ద ఉన్నట్లు సమాచారం రావడంతో దాడి చేసి పట్టుకుని విచారించగా చోరీ చేసినట్లు ఒప్పుకున్నాడన్నారు. వెంటనే అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని జింక మృతి



మృతిచెందిన జింకను పరిశీలిస్తున్న పోలీసులు, స్థానికులు

నార్పల : నార్పల మండల పరిధిలోని దుర్గం క్రాస్ రోడ్డు వద్ద ఆదివారం ఉదయం గుర్తుతెలియని వాహనం జింకను ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందింది. గమణించిన గ్రామస్తులు విషయాన్ని సర్పంచి రామాంజనేయులుకు తెలియజేయగా సర్పంచి జరిగిన స్థలానికి వెళ్లి అటవీశాఖ అధికారులకు విషయాన్ని తెలపగా అటవీ శాఖ అధికారులు ఎఫ్‌బిఓ మారెప్ప, సిబ్బందితో చేరుకుని చనిపోయిన జింకను స్వాధీనం చేసుకుని బుక్కరాయసముద్రం పశువుల ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు.